గిన్నీస్ బుక్‌లోకి తేజేశ్వరరావు

పాలకొండ: పట్టణానికి చెందిన వూన్న తేశ్వరరావు గుర్తింపు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పుస్తకంలో ఆయన రాసిన అంశాలకు చోటు దక్కింది. ఆరోగ్య విభాగానికి సంబంధించి డ్రగ్ డిజైనింగ్ వ్యాసాన్ని ఈ పుస్తకంలో పొందు పర్చారు. ఈ పుస్తకం ఆదివారం చెన్నైలో విడుదల చేశారు. తేశ్వరరావు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు పాలకొండలో చదువు కోగా, డిగ్రీ నుంచి ఇతర చదువులు విశాఖలో కొనసాగించారు. 2020లో పిహెచ్‌డి పూర్తి చేశారు. ఆయన తండ్రి నరసింగరావు పాలకొండలో చిన్న దుకాణం నిర్వహిస్తున్నారు. తల్లి గౌరి గృహిణి. దీంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

గిన్నిస్ వరల్డ్‌బుక్ రికార్డును అందుకుంటున్న తేజేశ్వరరావు

పాఠశాలల్లో తనిఖీలు జరిగేనా!

- లోపిస్తున్న జవాబుదారీతనం
- విద్యార్థులకు కొరవడిన నాణ్యమైన భోజనం
- తరచూ తనిఖీలు నిర్వహించాలని విన్నపం

ప్రజాశక్తి - కురుపాం

ప్రజల భాగస్వామ్యం లేకుండా ఎందులోనూ పురోగతి ఉండదు.. ఒకరికొకరు కలిసి పని చేసినప్పుడే ఆశించిన ఫలితాలు అందుతాయి. ఇందులో భాగంగానే పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటయ్యాయి. పాఠశాల అభివృద్ధిలో ప్రజలు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఇలా అందరూ సర్వశిక్ష అభియాన్ ద్వారా పాఠశాలల అభివృద్ధికి కృషి చేసే బాధ్యతను అమలు చేస్తున్నారు. పాఠశాలల పనితీరు, అభివృద్ధి విద్యనందించేందుకు పాఠశాల తనఖీ చాలా అవసరం. ఇందులో ప్రజలు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు ఉపాధ్యాయుల బాధ్యతను పెంచడానికి తనిఖీ అవసరం. ఈ కార్యక్రమం పారదర్శ కతను పెంచుతుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, బాలల హక్కులు పరిరక్షించడానికి ఉపయోగపడుతుంది. పాఠశాలలో ఉచిత విద్యకు ఆటంకం కలగకుండా ప్రోత్సహించడానికి సమర్థవంతంగా నాణ్యమైన విద్యను అందించడానికి దోహదపడుతుంది.

కురుపాంలో నాణ్యతలేని మధ్యాహ్న భోజనం

అయితే మండలంలోని పాఠశాలల తనిఖీ నామమాత్రంగా ఉంది. ప్రతి పాఠశాలకు యాజమాన్య కమిటీ ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్న తరుణంలో మరింతగా మెరుగుపడటానికి తనిఖీల ప్రాధా న్యత పెరిగింది. పాఠశాల అభివృద్ధికి ఎలాంటి పథకాలు ఉన్నాయి, వాటి కోసం ఎంత ఖర్చు చేశారు. ఎలా ఖర్చు పెట్టారు వంటి విషయాలను చూడాల్సి ఉంది. ఉపాధ్యాయుల నడవడిక, విద్యార్థుల పట్ల వారి ప్రవర్తన, వసతి కల్పన, మధ్యాహ్న భోజన పథకం తదితర విషయాలకు సంబంధించి విద్యా కమిటీ చైర్మన్లు, అధికారులు తనిఖీలు నిర్వహించడం వల్ల ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది. అప్పుడప్పుడూ పాఠశాలలకు వెళ్లి నామమాత్రంగా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేస్తుంటారు. అయితే జిల్లా అధికారులు తనిఖీలకు వచ్చే విషయం ముందు రోజు ఉపాధ్యాయులకు చేరవేయడంతో తప్పులు జరగకుండా అధికారులు వచ్చే సమయానికి సమస్యలు లేకుండా తాత్కాలికంగా దిద్దుకుంటూ ఉంటారు. అలా కాకుండా అకస్మిక తనిఖీలు చేస్తే ఉపయోగం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించి విద్యార్థులు భవిష్యత్తుకు మంచి బాటలు వేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమరభేరిని విజయవంతం చేయండి

30 నుంచి 4 వరకు ఆందోళనలు
సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - బెలగాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేకవిధానాలైన అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిరుద్యోగం, తదితర సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు తలపెట్టిన సమరభేరిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సమరభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 30, 31 తేదీల్లో ప్రజల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ, సభలు, సమావేశాలు జరిపి సంతకాల సేకరణ చేపట్టాలని, సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద నిరసన, వినతి పత్రాలు అందజేయాలని, సెప్టెంబర్ 3న నిరుద్యోగ వ్యతిరేక దినం పాటిస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలు సభలు జరపాలని, సెప్టెంబర్ 4న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ ఆఫీసుల వద్ద నిరసన ధర్నాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొల్లి గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బంటు దాసు పాల్గొన్నారు.

సాలూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం చేపట్టనున్న సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సమరభేరి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30నుంచి సెప్టెంబర్ 4 వరకు అన్ని సచివాలయాలను కలుసుకుంటూ నిరసన వ్యక్తం చేస్తూ వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.స్వప్న, టి.రాముడు, శంకరరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం మండల కన్వీనర్ డి. రమణారావు, నాయకులు కె.రాము, డి.దుర్గారావు, బి.పట్టాభి, ఎం.వీర నాయుడు, పి.ప్రభాకర్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు ప్రజల్లో ప్రచారం చేసి సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాలకొండలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

గుమ్మలక్ష్మీపురం : కేంద్రంలో మోడీ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సిపిఎం జిల్లా నాయకులు మండంగి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చాపరాయి బిన్నిడి, రాయగడ జమ్ము, దుడ్డుఖల్లు, కొత్తవలస తదితర గ్రామాల్లో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించే సమరభేరిపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా చేస్తుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు ఇస్తూ అడవిపై పూర్తి హక్కు వారికి ఉండేలా చేయడమే నూతన అటవీ సవరణ చట్టం ఉద్దేశం అన్నారు. ఇదే జరిగితే అడవి నుంచి గిరిజనులు దూరం కావడం ఖాయమన్నారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3ను రద్దు చేసిందన్నారు. దీంతో చదువుకున్న గిరిజన నిరుద్యోగయువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కావున ఈసమరభేరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పువ్వల తిరుపతిరావు, ఎం సన్యాసిరావు ఉన్నారు.

వంతెన పూర్తి చేసి గిరిజన ప్రాణాలు కాపాడాలి

11వ రోజుకు చేరిన దీక్షలు
శిరోముండనం చేసుకొని నిరసన

ప్రజాశక్తి- కొమరాడ

మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెనను పూర్తి చేసి గిరిజను ప్రాణాలు కాపాడాలని వంతెన సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. వంతెన పనులు ప్రారంభించారని కోరుతూ వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహారదీక్ష 11వ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా వంతెన పూర్తి కోసం టిడిపి, జనసేన నాయకులు రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం రిలే దీక్ష ప్రాంగణం వద్ద బాధిత గ్రామాల గిరిజనులు వంతెన పనులు ప్రారంభించి పూర్తి చేయలేని కోరుతూ సగం గుండు గీసుకొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం జరగనున్న ర్యాలీ, మహా ధర్నా కార్యక్రమంలో మండల ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కోవట్ల పేట నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టి అనంతరం కార్యాలయం బయట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పాలకులు వంతెన నిర్మాణంపై కనీస శ్రద్ధ చేపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. 2006లో శంకుస్థాపన చేసినా నేటికీ వంతెన పూర్తి కాకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం అతి పెద్ద వంతెనను మూడేళ్లలో నిర్మించినా మన ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి వంతెన పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసే గిరిజనుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన నాయకులు వంగల దాలినాయుడు, టిడిపి నాయకులు బత్తిలి శ్రీనివాసరావు, బురిడి వేణుగోపాలనాయుడు, ఎం.కృష్ణమూర్తి నాయుడు, సాధన కమిటీ సభ్యులు నూకరాజు తదితరులు ఉన్నారు.



శిరోముండనం చేసుకొని నిరసన తెలుపుతున్న గిరిజనులు, సంఘీభావం తెలిపిన టిడిపి, జనసేన నాయకులు

ఏజెన్సీలో ట్రెయినీ ఐఎఎస్‌ల పర్యటన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బొడ్డగూడ పంచాయతీ పరిధిలో 10 గిరిజన గ్రామాల్లోనూ, పూతిక వలస పంచాయతీ పరిధిలోని 10 గిరిజన గ్రామాల్లో గిరిజనుల ఆర్థిక, సామాజిక, సంప్రదాయాలు, సాంస్కృతిక జీవన విధానం, ప్రభుత్వ ఆరోగ్య సేవలను 5 రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు 13 మందితో కూడిన ట్రైనీ ఐఎఎస్‌ల బృందం మండలానికి విచ్చేసింది. భామినిలో కొత్తగా నిర్మించిన గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాల అదనపు భవనానికి వీరు ఆదివారం చేరుకున్నారు. 13 మంది ఐఎఎస్ లు రెండు బృందాలుగా పూతికవలస, బొడ్డవలస పరిసర గ్రామాలు పరిశీలించనున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి తెలిపారు. ట్రైనీ ఐఎఎస్‌ల రాకతో అధికారులు శరవేగంగా రహదారి, విద్యుత్ లైన్లు, వసతి గృహ అదనపు భవనానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం నుండి 5 రోజులు పాటు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గిరిజన పల్లెల్లో పర్యటించి గిరిజన జీవన స్థితిగతులు అధ్యయనం చేయనున్నట్లు ఐటిడిఎ అధికారులు తెలిపారు. ఈ బృందంలో ట్రైని ఐఎఎస్‌లు ఆదర్స్ పటేల్, వరుణ్ గౌడ, తుషార్ కుమార్, సోనం, శ్రీదేవి బివి, సిందే తుషార్ శ్రీహరి, మీరా పి ఆర్, వైశాలి.ఆర్, పియుష్ కుమార్, రుశేలి క్లర్, అభినవ్ ద్వివేది, అభిషేక్ బిందు,హర్మిరాన్ సింగ్ చీమ ఉన్నారు. వీరి వెంట ఐటిడిఎ సిసి సతీష్, ఎఎంఒ కోటిబాబు, తహశీల్దార్ అప్పారావు, గిరిజన వసతి గృహ సిబ్బంది వున్నారు.

ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధన, వసతులపై ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ ఐఎఎస్‌లు

ఏజెన్సీలో పర్యటించిన ట్రైనీ ఐఎఎస్ లు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఏకలవ్య గురుకుల మోడల్ పాఠశాలను ట్రైనీ ఐఎఎస్‌లు తమ శిక్షణలో భాగంగా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపల్ పెంటన్నతో మాట్లాడి ఏజెన్సీలో విద్యా విధానంపై, ఫలితాలు సాధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య భవన నిర్మాణానికి సుమారు రూ.22 కోట్లు ఖర్చయినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ భవనంలో విద్యార్థులకు కావలసిన తరగతి గదులు, డార్మెటరీ, వంటగది, భోజన గది, టాయిలెట్స్ తదితర అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు, వార్డెన్‌కు క్వార్టర్స్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రమాణాలను సంబంధిత ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ట్రైనీ ఐఎఎస్‌లు మమేకమయ్యారు. వారితో ఆటలు, పాటలు ఆడారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగునాయుడు

9/77అసైన్డ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలి

అన్యాక్రాంతమైన డి పట్టా భూములు తిరిగి పట్టాదారులకు ఇవ్వాలి
పట్టాదారులు, సాగుదారుల జాబితా సచివాలయాల్లో పెట్టాలి
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - బెలగాం

రాష్ట్ర ప్రభుత్వం 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరించి 20ఏళ్లు దాటిన డి-పట్టా భూములను అమ్ముకోవచ్చని జీవో చేసిందని, ఈ జీవో వల్ల జిల్లాలోని గిరిజనులు, దళితులు, పేదల వద్ద ఉన్న భూమి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోతుందని కావున ఈ సవరణనకు వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్లో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గత 40, 50 ఏళ్ల క్రితం ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి వలస వచ్చిన పెత్తందారులు సాలూరు, పాచిపెంట, మక్కువ, పార్వతీపురం, కొమరాడ మండలాల్లో వేల ఎకరాల భూములు కొనుగోలు చేశారని, అందులో డి-పట్టాలు కూడా ఉన్నాయన్నారు. ఇందులో కొంత భూమిని కొనుగోలు చేసి కొంత భూమిని దురాక్రమణ చేశారని అన్నారు. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన ఈ జీవోతో అక్రమంగా ఉన్న అసైన్డ్ భూములన్నీ మన్యం ప్రాంతంలో సక్రమంగా మారిపోతున్నాయన్నారు. దీనివల్ల గిరిజనులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున తక్షణమే 9/77 అసైన్డ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని కోరారు. అలాగే ఈనెల 31లోపు సచివాలయాల్లో డి-పట్టా సాగుదారులు, హక్కుదారులు పేర్లు నమోదు చేసి బహిరంగంగా జాబితా పెట్టాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ జిల్లాలో ఎక్కడా అధికారులు విచారణ చేయలేదన్నారు. దీంతో ఏ సచివాలయంలోనూ డి-పట్టా జాబితాలు పెట్టలేదని, వెంటనే కలెక్టర్, తహశీల్దార్లు జోక్యం చేసుకొని వాస్తవ డిపట్టాదారులు, సాగుదారుల జాబితాను సచివాలయాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే అన్యాక్రాంతమైన డి-పట్టా భూములన్నీ తిరిగి పట్టాదారులకు అప్పజెప్పాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున గిరిజనులను, దళితులను, పేదలను కదిలించి భూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రాము, బి.మోహన్‌రావు, గరుగుబిల్లి శ్రీనివాసరావు, దుర్గారావు, శివున్నాయుడు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో సబ్‌కలెక్టర్ పర్యటన

అధిక ఓట్లు తొలగింపు గ్రామాల్లో పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఎక్కువగా ఓట్లు తొలగించిన లాడ, దొరజమ్ము, రేగిడి గ్రామాల్లో పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదివారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆయా గ్రామాల్లో ఓట్లు తొలగించిన వ్యక్తులను పిలిపించి స్వయంగా ఫారం-7లను పరిశీలించారు. ఎందుచేత ఏ కారణంతో ఆయా వ్యక్తుల ఓట్లను సిబ్బంది తొలగించారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మరణానంతరం, వేరే ప్రదేశానికి వెళ్లిన వ్యక్తుల ఓట్లను మాత్రమే నిబంధనల ప్రకారం తొలగించాలని, లేనిపక్షంలో ఏ కారణంతోనైనా గ్రామంలో ఉన్న వ్యక్తుల ఓట్లను తొలగించకూడదని అన్నారు. ఒకవేళ అటువంటి ఓట్లను తొలగిస్తే సంబంధిత బిఎల్‌ఒలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దార్ జె.రాములమ్మ, బిఎల్‌ఒలు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

పక్కా ఇళ్ల కోసం ఎదురుచూపులు

ఇందిరమ్మ లబ్ధిదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పుష్కరకాలం పూర్తయినా, తెలుగుదేశం ప్రభుత్వం మారి వైసిపి ప్రభుత్వం వచ్చినా వారికి అవస్థలు మాత్రం తప్పడం లేదు. గతంలో టిడిపి హయాంలో ఇందిరమ్మ లబ్ధిదారుల గృహాలకు నిధులు మంజూరు చేయలేదు. అప్పటితో ఒకటి, రెండు బిల్లులతో అసంపూర్తిగా కొందరు ఇళ్లు నిలిచిపోగా, మరికొందరు మంజూరైనా పూరిపాకలోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత జగనన్న కాలనీలో ఊరోరా ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఈ లబ్ధిదారులకు మాత్రం చోటు దక్కలేదు. దీంతో మండలంలో సుమారు 1031 మంది ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు అవస్థలు పడుతూనే ఉన్నారు. అయినా ఏ ఒక్క ప్రభుత్వం కూడా వీరిని దృష్టిలో పెట్టుకోకుండా కొత్తవారికే ఇళ్లు మంజూరు చేస్తూ వస్తున్నారు. దీంతో అర్హత ఉన్నా గృహాల్లేక ఎన్నో ప్రయాసలకు గురికావలసి వస్తుందని వీరంతా ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మర్రివానివలసలో పూరిళ్లలోనే ఉంటున్న గిరిజనులు

కుప్పానాయుడు వర్ధంతిసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

కడవరకూ కష్టజీవుల కోసం పనిచేసిన కుప్పా నాయుడు

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం చేసుకునే అవకాశం ఉన్నా, కష్టజీవుల కోసం, అణగారిన వర్గాల కోసం కడవరకూ పోరాడిన నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు కుప్పానాయుడు మాస్టారని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్.కుప్పనాయుడు 11వ వర్ధంతి సభ మండలంలోని జీగిరాం జూట్ కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. తొలుత కుప్పానాయుడు చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, జ్యూట్ కార్మిక సంఘం నాయకులు సింహాచలం, శ్రీనివాస్ పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పురిటిపెంటలో నివాసం ఉండి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యలపైనా, మెంటాడ గిరిజన ప్రాంత సమస్యలపైనా, ఆండ్ర రిజర్వాయర్ నీటి సమస్యపై సుదీర్ఘకాలం పోరాటాలు నడిపారని తెలిపారు. ఆయన జీవితాన్ని పూర్తిగా పేదల కోసమే అంకితం చేసి, వివాహం కూడా చేసుకోకుండా, నిస్వార్థంగా కష్టజీవుల కోసం పనిచేశారని కొనియాడారు. చివరి రోజుల్లో అనారోగ్యంతో ఉన్నా, ప్రజా సమస్యలపై నిరంతరం ఆలోచించే మాస్టారుకు నివాళు లర్పించమంటే బడుగు బలహీనుల పక్షాన ఆయన ఆశయాలకు తగ్గట్టుగా నేడు ఉన్నటు వంటి కార్యకర్తలు ఆలోచనతో పనిచేయడమే మాస్టర్‌కు మనమిచ్చే మంచి నివాళి అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, శ్రీనివాసరావు, చిన్నారావు, కార్మికులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలు

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డి.వి.జి.శంకరరావు

విజయనగరం టౌన్ : వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుకొమ్మలని ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు తెలిపారు. శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో నెలవారీ సమావేశాన్ని క్లబ్ అధ్యక్షులు చెల్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యంగా తమ ఆరోగ్యం కాపాడుకుంటూ, యావత్ ప్రజానీకానికి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ప్రముఖ పాత్రను వాకర్స్ క్లబ్బులు పోషిస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ -102 గవర్నర్ కర్రోతు సత్యం, 42వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి, క్లబ్ ప్రధాన కార్యదర్శి కోట్ల సత్యనారాయణ, డాక్టర్ గాయత్రి, డి.శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలిని విచారిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

అట్రాసిటీ కేసుపై పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆదివారం విచారణ చేపట్టారు. వివరాలకు వెళ్తే కొండగొర్రి శారద, కొండగొర్రి అమల ఈనెల 23న ఉదయం 8గంటల సమయంలో విధులకు వెళ్లేందుకు సీతంపేటలో గల షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన పసుపురెడ్డి లోకేష్ అనే వ్యక్తి కులంపేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం పాలకొండ డిఎస్‌పిఒ కృష్ణారావు దర్యాప్తు చేసి వివరాలు రికార్డ్ చేశారు. ఆయనతో పాటు సిఐ సిఐ మురళీధర్, ఎస్సై నీలకంఠరావు ఉన్నారు.

29న కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ఈనెల 29న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కావున సమావేశానికి మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్లతో పాటు కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకి-2 పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీ అయిన రెడ్డి పైడపునాయుడును ఆ గ్రామ పెద్దలు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో సాయి మందిరం వద్ద ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ పైడపు నాయుడు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పిల్లలకు ఉన్నత విద్యలు అందించి ఎంతోమంది పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అలాగే గ్రామంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి పాపా రావు, ఎంపిటిసి జి.శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి చప్ప సత్యంనాయుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శివునాయుడు, కర్రి అప్పారావు, గంగాధర్, సంజీవ్ నాయుడు, శ్రీకాంత్, అప్పలనాయుడు, విద్యా కమిటీ చైర్మన్ చీకటి గౌరీశ్వరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న వైస్‌సర్పంచ్ అరవింద్‌కుమార్

ఘనంగా థెరిసా 113 వ జయంతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బుడ్డిపేటలో మదర్ థెరిసా 113వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబోగిలి గ్రామ ఉపసర్పంచ్ కె.అరవింద్‌కుమార్ మాట్లాడుతూ మదర్ థెరిసా పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఆమె సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని యువకులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి, యువజన సంఘం అధ్యక్షులు ఎస్.వెంకటరమణ, గౌర్నాయుడు, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపిడిఒ కార్యాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న టి.దినేష్‌కుమార్ (28) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న దినేష్ కుమార్‌కు వైద్య సేవలందించినప్పటికీ ఆదివారం పరిస్థితి విషమించడంతో లఖనాపురం నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం ఆసుపత్రి తరలిస్తుండగా మృతి చెందారు. దినేష్ కుమార్ మృతి పట్ల ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఎఒ ఎన్.అర్జునరావు, ఆఫీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి తరలివచ్చారు. పార్క్‌లోని అందాలను ఆశ్వాదించారు జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. చిన్నారులు బుల్లి ట్రైన్లో సరదాగా గడిపారు. ఆనంద విహార వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు వేశారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో తాగునీటి కష్టాలు తీరనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. రూ.53లక్షల అంచనా వ్యయంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలుఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి పైపులు కూడా సిద్ధం చేశామన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగ కర్త ఎస్‌విఎల్‌ఎన్ శర్మయాజి సహకారాలతో ఈ కార్యక్రమంలో నిర్వహించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్లపై దర్జాగా పశువులు

- పాదచారులు, వాహన చోదకులు ఇక్కట్లు
- కమిషనర్ ఆదేశాల బేఖాతరు
- పట్టించుకోని యజమానులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా ప్రధాన కేంద్రంలోని ప్రధాన రహదారిలో దర్జాగా పశువులు సంచరిస్తుండడంతో వాటిని నియంత్రించేందుకు స్థానిక మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు పశువులు రహదారిపై సంచరిస్తే ఉపేక్షించేది లేదని ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత యజమానులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విడ్డూరంగానే ఉంది. ప్రధాన రహదారిలో పశువులు సంచరించడమే కాక రోడ్డుపై వాటి వ్యర్థాలను చిందర వందర చేయడంతో కలుషిత వాతావరణం నెలకొంది. అలాగే పట్టణ ప్రధాన కూడళ్ల వద్ద అవి తిష్టవేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు, ఆయా కూడళ్లలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనచోదకులు అనేక ఇబ్బందులకు గురవ్వడమే కాక, పలు సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి ఆసుపత్రులు పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా వాటిని పెంపకం చేసే యజమానులకు ఏమాత్రం చీమకుట్టైన లేకపోవడం గమనార్హం. జిల్లా కొత్తగా ఏర్పాటైన అనంతరం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నిశాంత్ కుమార్ జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో పర్యటించిన సమయంలో ప్రధాన రహదారి పైనే పశువుల సంచారం ఉండడం గమనించి మున్సిపల్ అధికారులకు వాటిని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టమని అప్పటిలోనే ఆదేశాలు జారీ చేశారు. అయినా ప్రధాన రహదారిపై పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు ఇప్పటి వరకు కార్యాచరణ చేపట్టకపోవడం అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీటి సంచారాన్ని ప్రధాన రహదారిపై నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

వార్డుల్లో పర్యటిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పట్టణంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పట్టణంలోని 18వ వార్డు పరిధిలో గల చినకాపువీధి, సనారీవిశ్వేశ్వరుని కోవెల వీధి, మొగిలి వీధి, మేదర వీధుల్లో ఆదివారం సాయంత్రం పర్యటించారు. వార్డు కౌన్సిలర్ కిల్లారి మోహనరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఎమినిటీ సెక్రటరీలతో కలిసి పర్యటించి వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించారు. లైట్లు వెలగని ప్రాంతాలను గుర్తించి తక్షణం రిపేర్ చేయించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీధి దీపాలు వెలిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజూ సాయంత్రం వార్డుల్లోని వీధుల్లో ఒక ప్రణాళిక ప్రకారం పర్యటించి ప్రజలకు సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రయివేట్ ఒకేషనల్ విద్యాసంస్థలపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో గల ప్రయివేట్ ఇంటర్మీడియట్ ఒకేషనల్ జూనియర్ కాలేజీలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ, గిరిజన విద్యార్థి సంఘాలు నాయకులు ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా అక్కడ బోధిస్తున్న అధ్యాపకులు అర్హత లేనటువంటి వారితో సబ్జెక్టులు చెప్పిస్తున్నారని అధ్యాపకులుగా పేర్లు ఒకరివి బోధిస్తున్న వ్యక్తులు వేరొకరని తెలిపారు. వీరికి కనీసం సబ్జెక్టుపై అవగాహన లేనటువంటి వ్యక్తులతో కాలేజీ అధ్యాపకులుగా వ్యవరిస్తున్నారన్నారు. అంతేకాక సరైన ల్యాబ్‌లు, పరికరాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాల్సినవి లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలు, కళాశాలల నడుస్తున్నాయని, వీటిపై ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి దర్యాప్తు జరిపి, అలాంటి కాలేజీలను, పాఠశాలలను ప్రభుత్వం గుర్తింపులు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పార్టీలో చేరిన యువతకు కండవా వేస్తున్న జనసేన నాయకులు అక్కివరపు

బుదురువాడలో జనసేన వారోత్సవాలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జనసేన ఆవిర్భావ సందర్భంగా వారోత్సవాలను మండలంలోని బుదురువాడలో జనసేన నాయకులు అక్కివరపు మోహన్ రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన అధికారంలోకి వస్తే అవినీతి లేని పాలన, మహిళలకు రక్షణ, నిరుద్యోగులకు ఉద్యోగాలు వంటివి కల్పించడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తారన్నారు. ఇప్పటికే జనసేన విధి విధానాలకు ఆకర్షితులై అనేక గ్రామాల్లో చేరికలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మోహనరావు, జనసేన మండల అధ్యక్షులు ఆగూరు మణి, రాష్ట్ర ఐటీ వింగ్ సభ్యులు గేదెల సతీష్ సమక్షంలో బుదురువాడలో 50 కుటుంబాలు జనసేనలో చేరాయి. కార్యక్రమంలో రాజన బాలు, బొనేల గోవిందమ్మ, ఖాతా విశ్వేశ్వరావు, గుంట్రెడ్డి గౌరీశంకర్, అల్లు రమేష్, గొలగాన సత్యనారాయణ, కర్రి మణికంఠ, చిట్లి గణేశ్వరరావు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, అంబటి బలరాం, కనకరాజు, పైల రాజు, దుర్గా ప్రసాద్, చంద్రశేఖర్, కృప తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగు.. లాభాలు బాగు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
రసాయనిక ఎరువు లేని పంటలపై ఆసక్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నేటి సమాజంలో పుట్టుకతోనే అనేక వ్యాధులు వెంటాడుతున్న ఈ రోజుల్లో కలుషితమవుతున్న ఆహార సంపదలను, సంప్రదాయ ప్రకృతి సేంద్రియ పంటలుగా మలుచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యం, వాతావరణంలో మార్పులు, కలుషిత ఆహారం వల్ల మనిషి రోగాల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. బిపి, షుగర్ అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కరోనా తర్వాత కూడా చాలామంది ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కువ శాతం రసాయనిక ఎరువుల్లేని స్వచ్ఛమైన ఆహారంతో పాటు చిరుధాన్యాలపై ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జట్టు సంస్థ సహకారంతో ఏజెన్సీలో గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందుతూ ఆర్థికంగా బలోపేతం చెందుతున్నారు.

మండలంలోని 27పంచాయతీల్లో 189 గ్రామాల్లో 8772 మంది గిరిజన రైతులు 22687 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. మరోవైపు ప్రకృతిని, పర్యావరణం పరిరక్షణకు వీలుంటుంది. కార్బన్ శాతం పెంచడం వల్ల భూతాపం తగ్గించాడానికి వీలుంటుంది. రైతులు శ్రీవరి, శ్రీరాగి పంటలతో పాటు అంతర పంటగా చిరుధాన్యలు, ఆకు కూరలు, కాయగూరలు పండిస్తున్నారు. వరి విస్తీర్ణం తగ్గించి చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు, పప్పు ధాన్యాలు విస్తీర్ణం పెంచడం అధిక ధరలకు అమ్మకంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాడానికి వీలుంటుంది.

ఆదర్శ రైతు : ఎంపిటిసి మల్లేష్

జీరో పెట్టుబడితో పంటల అధిక దిగుబడి సాధిస్తూ ఆదర్శంగా నిలిచారు. ఇరిడి కద్రక ఎంపిటిసి మల్లేశ్వరరావు గత రెండేళ్లుగా ఒకవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటేనే మరోవైపు తనకు ఉన్న మూడు ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఘనజీవామృతం, వేప కషాయం, నీమాస్త్రం పిచికారీ చేస్తూ అజోలాని పెంచేందుకు చర్యలు తీసుకుని పొటాస్‌ను తయారు చేసుకుని పంటలు పండిస్తున్నారు.

రాయగడ జమ్ములో శ్రీరాగి ఉబాలు వేసిన గిరిజనులు

శ్రీ వరి సాగు చేస్తున్న గిరిజన మహిళ

చిరుధాన్యాలకు పెరిగిన గిరాకీ

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో తరతరాల నుంచి గిరిజనులు పండించే చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఏర్పడింది. కొండపోడు వ్యవసాయంలో చోడి, కొర్రలు, జొన్నలు, జుడుములు, కందులు, గంటెలు, రాగులు తదితర పంటలు పండిస్తున్నారు. కరోనా తర్వాత చిరుధాన్యాలకు బయట మార్కెట్లో బాగా డిమాండ్ పెరిగింది.

ఖర్చుల భారం తగ్గిందిలి..

ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే వేలకు వేలు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చేది. మాలాంటి పేద రైతులు అప్పులు చేయక తప్పేది కాదు. జట్టు సంస్థ సహకారంతో తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాం.

- కె.పువ్వల సుందరమ్మ,
మహిళా రైతు, రాయగడ జమ్ము.

రసాయన ఎరువులు లేని పంట

ప్రకృతి వ్యవసాయంతో రసాయనిక ఎరువులు లేని పంటలు పండించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు ఉంటుంది. పంటలు పండించే విధానంలో జట్టు సభ్యుల సలహాలు, సూచనలు పాటించడంతో తక్కువ ఖర్చుతో పంటలు వేసుకోవడానికి వీలుంటుంది. ప్రతి ఒక్కరూ. ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి.

- ఎ.దేవి, మహిళా రైతు

రైల్వేస్టేషన్ రోడ్డు బాగుచేయండి మహాప్రభో...

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలోని సీతానగరం రైల్వే స్టేషన్ నుంచి ప్రధానరోడ్డుకు గల రహదారి పూర్తిగా గుమ్ములు, గోతులతో కూడి ఉన్నందున రాత్రిపూట రైలు దిగే ప్రయాణికులు వెళ్తున్న సమయంలో గోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచే వెళ్లేవారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారంతా కేవలం 500మీటర్ల దూరం వెళ్లడానికి నరకం చూస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు పెద్ద ఎత్తున చేరి ఉండటంతో గత మూడు రోజులుగా అనేక మంది ద్విచక్ర వాహన చోదకులు జారిపడి ప్రమాదాలకు గురయ్యారు. మూడో రైల్వే లైన్ పనుల వల్ల స్టేషన్‌కు ఉండే బిటి రోడ్డును కప్పివేయడం, గుమ్ములు, గోతులతో రోడ్డు ఉండడంతో ఎలా వెళ్లాలని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అధిక ఆదాయం కలిగే రైల్వేలో రోడ్డు ఇలా ఉండడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే మెటీరియల్, పనిచేసే మనుషులు పెద్దఎత్తున ఉన్నా రోడ్డును ఎందుకు మరమ్మతులు చేయడం లేదనిపలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆదివారం స్థానిక విలేకరులు పరిశీలించి సమస్య తీవ్రతను రాయగడలో గల ఎఇఇ, బొబ్బిలిలో ఉన్న ఐఒడబ్ల్యు అధికారి, స్టేషన్ మాస్టారుల దృష్టికి తీసుకెళ్లగా వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఇప్పటికే పలుసార్లు నివేదించినా సమస్య పరిష్కారం జరగలేదని తెలిపారు. దీంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను అరకు పార్లమెంటు సభ్యులు గొడ్డేటి మాధవి దృష్టికి సంతకాలు చేసిన ఒక వినతి పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. దీనిపై ఎంపి స్పందిస్తూ రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు దుస్థితిని విశాఖ డివిజనల్ రైల్వేమేనేజర్ దృష్టికి తీసుకెనట్టు తెలిపారు. ప్రయాణికులు రోడ్డు వల్ల రాత్రిపూట ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని తక్షణమే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

గతుకులమయమైన రోడ్డు

ఎఎన్ఎంలపై పనిభారాన్ని తగ్గించాలి

యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్యఆరోగ్య శాఖకు మూలస్థంబాలుగా పనిచేస్తున్న ఎఎన్ఎంలు తీవ్ర పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్హతతో మాత్రమే ఉద్యోగాలు పొందిన వీరు నేడు వారి అర్హతకు మించిన బాధ్యతలను మోస్తున్నారని, వెంటనే పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఎఎన్ఎంల జిల్లా సదస్సుతో ఆయన మాట్లాడారు. ఎఎన్ఎంలు రోజువారీ పనుల్లో భాగంగా దాదాపు 56 యాప్‌లను ఉపయోగించి సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి వస్తోందన్నారు. ఫలితంగా తీవ్ర వత్తిడికి గురవడమే కాకుండా ఆరోగ్య పరమైన సమస్యలను సైతం ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే వారి సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆ సంఘం జిల్లా కన్వీనర్ జివిఎస్‌ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హెల్త్ సెక్రటరీస్ గ్రేడ్ 3 ఎఎన్ఎంల రాష్ట్ర అధ్యక్షులు ఎ. మాధవి, ఎపిఎన్‌జిజిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుక్కల సత్యనారాయణ, తదితరులు ప్రసంగించారు. అనంతరం జిల్లా నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ. మాధవి, ఉపాధ్యక్షులుగా జి.పైడిరాజు, కె.కళావతి, ఎం.పైడన్న, వెంకటేశ్వరరావు, రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.వి.ఎస్.ఎన్. మూర్తి, కార్యదర్శులుగా భవాని, ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, పి.వి.రమణ, పి.అన్నపూర్ణ, సూర్యకుమారి, కోశాధికారిగా ధనుంజయ్ ఎన్నికయ్యారు.

‘చదవడం మాకిష్టం’

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే పలురకాల పుస్తకాలున్నాయని, వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ఆటలపోటీలు, చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలోపాల్గొన్నారు.

విద్యార్థులతో చదివిస్తున్న గ్రంథాలయాధికారి

కొండాడలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు భూదేవి

‘బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ’

ప్రజాశక్తి - సీతంపేట

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి అన్నారు. ఆదివారం కొండాడ పంచాయతీలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. టిడిపి మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క అవకాశమని వైసిపికి అధికారం కట్టబెట్టిన పాపానికి రాష్ట్రం అస్థవ్యస్థంగా మార్చారని విమర్శించారు. మద్య నిషేధం పేరుతో మహిళలను దగాచేశారని ఆరోపించారు. ముఖ్యంగా గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాల్సిందేనన్నారు. మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహాలక్ష్మి లాంటి మహాశక్తి పథకం మహిళలకు వరం లాంటిదన్నారు. టిడిపి పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కావున రానున్న ఎన్నికల్లో సైకోను ఇంటికి పంపించాల్సిన బాధ్యత ప్రజలంతా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర కుంపి, మాజీ ఎంపిటిసి బి.జయలక్ష్మి, సవర చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాసాపేట సమీపాన రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాసాపేటకు చెందిన శంకు శ్రీనివాసరావు (47) కాలకృత్యాలు తీర్చుకొనేందుకు సమీపానున్న పద్మనాభం చెరువు వద్దకు ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో ఉన్న రైలు పట్టాలను దాటుతుండగా సీతానగరం నుంచి బొబ్బిలికి వచ్చే అప్‌లైన్ ట్రాక్ గూడ్స్‌రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఆయనకు భార్య భారతి, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు స్థానిక శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బొబ్బిలి ఔట్‌పోస్టు హెచ్‌సి కృష్ణారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వీరఘట్టం మండలం నడుకూరుకు చెందిన రైతు అచ్చియ్యమ్మ మస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆదివారం కోడలు, వియ్యంకురాలితో గొడవ జరిగింది. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న బాత్రూం క్లీనర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్పందించిన కుటుంబీకులు వీరఘట్టం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

నాటుసారా రవాణాపై దాడులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఒడిశా నుండి ఆంధ్రాకు నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో ఎస్ఇబి అధికారులు ఆదివారం పెదమరికి సమీపంలో కాపుకాసి 160 లీటర్ల నాటుసారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఒడిశాకు చెందిన నాటుసారా సరఫరాదారుడు చంద్రయ్యాపై కేసు నమోదు చేశారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీ రెల్లివీధికి చెందిన వినోద్‌ను వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్ఐ వివి రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.